సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శుక్రవారం । 17 । ఫిబ్రవరి । 2023



టన్ను చీనీ రూ.35 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.35 వేలు, కనిష్టంగా రూ.14 వేలు, సరాసరిన రూ.21 వేలు పలికాయి.



కిలో టమాట రూ.20

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.20, కనిష్టంగా 5, సరాసరిన రూ.10 ప్రకారం పలికాయి.


గరిష్ఠం/కనిష్ఠం
36.6°/8.7°

జిల్లా పరిధిలో గురువారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఉదయం పూట చాలా మండలాల్లో చలితీవ్రత పెరిగింది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. పగలు ఎండ రాత్రి చలి వాతావరణం కొనసాగుతోంది.

తమ్ముళ్ల డీలా!

జిల్లాలోనే ధర్మవరం నియోజకవర్గం కీలకం. అలాంటి నియోజకవర్గంలో టీడీపీ ఉనికే ప్రశ్నార్థకంగా మారింది. ఎన్నికలు ఏవైనా సరే సైకిల్ పంక్చర్ అవుతూనే ఉంది. ఎన్నికలు సమీపిస్తున్నా ఆ పార్టీ అభ్యర్థి ఎవరనేదానిపై కూడా స్పష్టత లేకపోవడంతో తమ్ముళ్లు డీలా పడ్డారు.

- ధర్మవరం టీడీపీ టికెట్ ఎవరిదో ?
- కార్యకర్తలను పట్టించుకోని ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్
- టీడీపీలో ఎంట్రీ కోసం వరదాపురం సూరి తంటాలు
- ఎన్నికలు సమీపిస్తుండటంతో అయోమయంలో తెలుగు తమ్ముళ్లు
- 'గుడ్ మార్నింగ్'తో ప్రజల్లోనే ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



సాక్షి, పుట్టపర్తి: ఎన్నికలు సమీపిస్తుండటంతో అప్పుడే రాజకీయ వేడి మొదలైంది. అయితే జిల్లాలోనే కీలకమైన ధర్మవరం నియోజకవర్గంలో టీడీపీకి అభ్యర్థి కూడా దిక్కులేకుండా పోయారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఏ పార్టీతో జతకడతారో? ధర్మవరంలో ఎవరిని పోటీలో దింపుతారో? తెలీకపోవడంతో తమ్ముళ్లు అయోమయ పరిస్థితిలో పడ్డారు. ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ రెండు నెలలుగా ధర్మవరం వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. మరోవైపు తెరవెనుక పావులు కదుపుతున్న బీజేపీ నేత వరదాపురం సూరి కూడా ధర్మవరం వైపు దృష్టిసారించలేదు. పొత్తులో భాగంగా తనకే టికెట్ వస్తుందని చెప్పుకుంటున్న జనసేన పార్టీ నాయకుడు చిలకం మధుసూదన్‌రెడ్డి కూడా మౌనంగానే ఉన్నారు.

కన్నెత్తి చూడని 'వరదాపురం'

ధర్మవరం మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ (వరదాపురం సూరి) టీడీపీలో ఎంట్రీ కోసం తహ తహలాడుతున్నారు. అయితే టికెట్‌పై టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇవ్వలేదని సమాచారం. ఫలితంగా వరదాపురం సూరి ఎంట్రీ ఎప్పుడనే దానిపై స్పష్టత లేదు. దీంతో గత రెండు నెలలుగా ఆయన నియోజకవర్గం వైపు కన్నెత్తి చూడలేదు. దీంతో 'వరదాపురం' వర్గీయులు అయోమయంలో పడ్డారు. వరదాపురం వైపు ఉండాలా? లేక పరిటాల వైపు మొగ్గు చూపాలా? పార్టీ నిర్ణయించే అభ్యర్థి వైపు ఉండాలా? అనేది తేల్చుకోలేకపోతున్నారు.

పత్తా లేని 'పరిటాల'

రాప్తాడులో టికెట్ ఇస్తారా? లేక ధర్మవరం నుంచి పోటీ చేయిస్తారా? అనే అంశంపై అధిష్టానం నుంచి ఎలాంటి స్పష్టత లేకపోవడంతో పరిటాల శ్రీరామ్ ఆందోళనలో పడ్డారు. ఫలితంగా రాప్తాడుకే పరిమితమై ధర్మవరం గురించి పట్టించుకోవడంలేదని తమ్ముళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరదాపురం సూరికి టికెట్ ఇస్తే.. టీడీపీకి రాజీనామా చేస్తానని పరిటాల శ్రీరామ్ గతంలో ప్రకటించారు. ధర్మవరం సీటు ఆశించడం కంటే వరదాపురం ఎంట్రీని అడ్డుకునేందుకే ఆయన ఎక్కువ సమయం కేటాయిస్తున్నట్లు తెలిసింది.

పరిటాల వర్సెస్ వరదాపురం

పరిటాల కుటుంబానికి వరదాపురం సూరికి ఎన్నో ఏళ్లుగా వైరం ఉంది. పరిటాల రవీంద్ర కాలంలోనే ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తాయి. అనంతరం టీడీపీ అధిష్టానం ఆదేశాల మేరకు వరదాపురం సూరి ధర్మవరం నుంచి 2014లో పోటీ చేసి విజయం సాధించారు. అదే సమయంలో పరిటాల సునీత రాప్తాడు నుంచి గెలిచి మంత్రివర్గంలో చేరారు. అలాంటి పరిస్థితుల్లో కూడా పరిటాల సునీతను ధర్మవరం వైపు రానీయకుండా అడ్డుకట్ట వేయడంలో వరదాపురం సఫలం అయ్యారు. గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనంలో ఇటు పరిటాల శ్రీరామ్, అటు వరదాపురం సూరి ఇద్దరూ ఓడిపోయారు. ఎన్నికల తర్వాత వరదాపురం సూరి బీజేపీకిలోకి జంప్ చేశారు. నాటి నుంచి నేటి దాకా వారి మధ్య మాటల యుద్ధం కొనసాగుతూనే ఉంది.

సంక్షేమ పథకాల వైపు ప్రజల మొగ్గు

వైఎస్సార్‌సీపీ సర్కార్ అధికారం చేపట్టిన నాటి నుంచి ఎలాంటి తారతమ్యాలు లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తోంది. ప్రజల వద్దకే పాలన నినాదంతో గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటకు ప్రభుత్వ సేవలను తీసుకొచ్చింది. ఫలితంగా ప్రజలందరూ ప్రభుత్వం అందజేస్తోన్న సంక్షేమ ఫలాలతో సంతోషంగా ఉన్నారు.

'గుడ్ మార్నింగ్'తో దగ్గరగా...

ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి 'గుడ్ మార్నింగ్ ధర్మవరం' పేరుతో రోజూ ప్రజల్లో ఉంటున్నారు. అధికారులను వెంట పెట్టుకుని ప్రజా సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కార మార్గం చూపిస్తున్నారు. ఫలితంగా అన్ని వర్గాల ప్రజల నుంచి మన్ననలు పొందుతున్నారు.

ఎన్నికలేవైనా 'ఫ్యాన్'దే హవా

2019 నాటి నుంచి ఎన్నిక ఏదైనా విజయం వైఎస్సార్‌సీపీదే. ధర్మవరం మున్సిపాలిటీలో 40కు 40 స్థానాలు వైఎస్సార్‌సీపీ కై వసం చేసుకుంది. అలాగే బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ జెడ్పీటీసీ స్థానాలతో పాటు ఎంపీపీ స్థానాలను సొంతం చేసుకుంది. ఒక్క చోట కూడా టీడీపీ బోణీ కొట్టలేక చతికిలపడింది. టీడీపీ అభ్యర్థి ఎవరైనా వచ్చే ఎన్నికల్లోనూ ఆ పార్టీకి పరాభవం తప్పదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

న్యూస్‌రీల్

పప్పుశనగ మద్దతు ధర రూ.5,335



పుట్టపర్తి అర్బన్: జిల్లాలో పప్పుశనగకు మద్దతు ధర క్వింటాలుకు రూ.5,335 ప్రకటించినట్లు ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ గీతమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు తమ సరుకును ప్రభుత్వానికి విక్రయించే ముందు స్థానిక ఆర్‌బీకేలలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ – క్రాప్ నమోదు చేసుకున్న రైతుల పంట ఉత్పత్తులను మాత్రమే కొనుగోలు చేస్తామని వెల్లడించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డీజిల్ సరఫరాకు టెండర్ల ఆహ్వానం

పుట్టపర్తి టౌన్: జిల్లాలోని ధర్మవరం, హిందూపురం, కదిరి, మడకశిర, పుట్టపర్తి ఆర్టీసీ డిపోల్లో డీజిల్ సరఫరాకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ప్రజా రవాణా అధికారి మధుసూదన్ పేర్కొన్నారు. డీజిల్ కాంట్రాక్ట్ రెండు నెలలు మాత్రమే ఉంటుందని, నాణ్యతను బట్టి మరో రెండు నెలలు అదనంగా పెంచుతామన్నారు. టెండర్లకు సంబంధించి ఆయా డిపో కార్యాలయాల్లో నిబంధనలతో కూడిన టెండర్ దరఖాస్తు ఫారాలను పొంది ఈనెల 24 తేదీ సాయంత్రంలోపు జిల్లా కేంద్రంలోని ఆర్ఎం కార్యాలయంలో టెండర్ బాక్స్‌లో వేయాలన్నారు. డిపోలకు విడివిడిగా టెండర్లు దాఖలు చేసుకోవాలన్నారు. అదే రోజు సాయంత్రం టెండర్లు తెరుస్తామన్నారు. మరిన్ని వివరాలకు ఆయా డిపో మేనేజర్లను సంప్రదించాలన్నారు

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గం ఎంపిక



నూతన కార్యవర్గంతో రాష్ట్ర కార్యదర్శి ఆస్కార్‌రావ్

పుట్టపర్తి టౌన్: ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక జానకిరామయ్య కల్యాణ మండపంలో గురువారం ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆస్కారావ్ అధ్యక్షతన జిల్లాస్థాయి ఉద్యోగుల సంఘం సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా భాస్కర్‌రెడ్డి (ఆర్అండ్‌బీ) కార్యదర్శిగా బాబాఫక్రోద్దీన్ (వైద్య, ఆరోగ్యశాఖ) ఉపాధ్యక్షుడిగా రమేష్‌బాబు (పంచాయతీరాజ్) ట్రెజరర్‌గా నారాయణరెడ్డి (ఐసీడీఎస్) జాయింట్ సెక్రటరీలుగా మల్లికార్జున, శ్రీదేవి, గోవిందు, గౌరీదేవి, శివరాజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రాజు, కార్యదర్శి బాబాసాహెబ్, అనంతపురం జిల్లా అధ్యక్షుడు గోపి, కార్యదర్శి రాము, నాయకులు నరసింహులు, సత్యనారాయణబాబు, రవిశంకర్, సాంబశివయ్య, నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైపాస్ కెనాల్ నిర్మాణానికి ఎస్ఎల్‌టీసీ ఆమోదం

- త్వరలో పనులు ప్రారంభిస్తామన్న ఎస్ఈ దేశేనాయక్

మడకశిర: మడకశిర హంద్రీనీవా బైపాస్ కెనాల్ నిర్మాణానికి రాష్ట్రస్థాయి టెక్నికల్ కమిటీ (ఎస్ఎల్‌టీసీ) కూడా ఆమోదం తెలిపిందని హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ దేశేనాయక్ గురువారం 'సాక్షి'కి తెలిపారు. ఈ కెనాల్ నిర్మాణానికి అవసరమైన అన్ని ప్రక్రియలు పూర్తయ్యాయని తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బైపాస్ కెనాల్ నిర్మాణానికి రూ. 214.85 కోట్లు మంజూరు చేసిందన్నారు. సదరు కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ ప్రక్రియ పూర్తి చేసిన వెంటనే పనులకు శ్రీకారం చేపడతామన్నారు. అలాగే నియోజక వర్గంలోని అమరాపురం మండలానికి జాప్యం లేకుండా కృష్ణా జలాలు అందించడానికి వీలుగా రూ.2.31 కోట్లతో చేపట్టిన తాత్కాలిక పనులు కూడా పూర్తయ్యాయని పేర్కొన్నారు. ఎగువ ప్రాంతంలో దెబ్బతిన్న హంద్రీనీవా కాలువ మరమ్మతు పనులను చేపట్టాల్సి ఉందన్నారు. మరమ్మతు పనులు చేపట్టడానికి అవసరమైన నిధుల కోసం ప్రతి పాదనలు పంపామని వెల్లడించారు. మరమ్మతు పనులు పూర్తి చేసిన వెంటనే అమరాపురం మండలానికి కృష్ణా జలాలను విడుదల చేస్తామన్నారు. ప్రస్తుతం గొల్లపల్లి రిజర్వాయర్‌ను కృష్ణా జలాలతో పూర్తిస్థాయిలో నింపామని చెప్పారు. ఆ నీటిని అమరాపురం మండలానికి తీసుకెళ్లడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

టెక్నాలజీని మరింతగా అభివృద్ధి చేస్తాం



అంతరిక్ష వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొన్న శాస్త్రవేత్తలు

ధర్మవరం అర్బన్: దేశంలో సైన్స్ టెక్నాలజీని మరింత అభివృద్ధి పరుస్తూ ప్రజలకు అన్ని విధాలా ఉపయోగపడే విధంగా కృషి చేస్తామని శ్రీహరికోట డీజీఎం మురళీధర్ తెలిపారు. పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీహరికోట అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో అంతరిక్ష వైజ్ఞానిక ప్రదర్శనను (స్పేస్ ఆన్ వీల్స్.. ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్) ఏర్పాటు చేశారు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థిని, విద్యార్థులు, యువతి, యువకులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు ప్రదర్శనను తిలకించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లింగం నిర్మల, వైస్ చైర్మన్ పెనుజూరు నాగరాజు, డీవీఈఓ రఘునాథ్‌రెడ్డి అతిథులుగా విచ్చేసి ప్రదర్శనను తిలకించారు. డీజీఎం మురళీధర్ మాట్లాడుతూ స్పేస్ ఫలితాలు అందరికీ తెలిసే విధంగా తమ వంతుగా కృషిచేస్తున్నామన్నారు. విద్యార్థులు సైన్స్‌ను పూర్తిగా అవగాహన చేసుకుని టెక్నాలజీతో మన దేశాన్ని అభివృద్ధి బాటలో నడిపించేలా కృషి చేయాలని సూచించారు. శ్రీహరికోట శాస్త్రవేత్త మనోహర్‌రెడ్డి, సభ్యులు అనిల్, బాబురావు, ప్రసాద్, కిషోర్, మురళి, కళాశాల వైస్ ప్రిన్సిపల్ జీవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు అందించండి



ఏఈఓల సంఘం డైరీని ఆవిష్కరిస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: వ్యవసాయాన్ని పండుగ చేసేలా రైతులకు అన్ని విధాలా అందుబాటులో ఉండి ఏఈఓలు రైతుల సేవలో తరించాలని డీఏఓ సుబ్బారావు పేర్కొన్నారు. గురువారం స్థానిక జిల్లా వ్యవసాయ కార్యాలయంలో ఏఈఓల సంఘం ఆధ్వర్యంలో ప్రచురించిన వార్షిక డైరీలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ రబీ, ఖరీఫ్ రెండు కాలాల్లోనూ విత్తనం సాగు చేసినప్పటి నుంచి పంట కాలం పూర్తయ్యే వరకూ రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. ముఖ్యంగా పంట కాలంలో ఈ క్రాప్ బుకింగ్ చేయడం ద్వారా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు రైతులకు అందేలా చూడాలన్నారు. త్వరలోనే ప్రభుత్వం అందజేసే ఇన్‌పుట్ సబ్సిడీపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం డీఏఓను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఈఓల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చక్రపాణిరెడ్డి, ఈసీ మెంబర్ ఉపేంద్రరెడ్డి, సభ్యులు ఆనంద్‌నాయక్, రియాజ్, ప్రసాద్, అశోక్, సునీత, రాఘవేంద్ర, రెడ్డి, సుధాలక్ష్మి, షరీఫ్, అంజాద్‌బాషా, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

తొలి రోజు రెండు నామినేషన్లు



పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ పత్రాలను అందజేస్తున్న రవీంద్రారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్‌రెడ్డి



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ పత్రాలను ఆర్ఓ కేతన్‌గార్గ్‌కు అందజేస్తున్న రామచంద్రారెడ్డి

- ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ ఘట్టం ప్రారంభం
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి రామచంద్రారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీకి రవీంద్రారెడ్డి దాఖలు

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ (అనంతపురం, వైఎస్సార్, కర్నూలు జిల్లాలు) పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, అనంతపురం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల తొలి అంకం నామినేషన్ ఘట్టం గురువారం ప్రారంభమైంది. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్ గార్గ్ నోటిఫికేషన్ విడుదల చేశారు. అనంతరం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ల ప్రక్రియ ఈనెల 23 వరకు ఉంటుందన్నారు. 24న పరిశీలన నిర్వహిస్తారన్నారు. ఉపసంహరణకు 27 వరకూ అవకాశముంటుందన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల దాఖలు..

తొలి రోజున రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులుగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి ఎం.వి.రామచంద్రారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీకి వెన్నపూస రవీంద్రారెడ్డి నామినేషన్ వేశారు. ఆర్ఓకు ఆయన చాంబర్‌లో నామినేషన్ పత్రాలను అందజేశారు. ఒక సెట్ నామినేషన్ వేసిన ఇరువురు అభ్యర్థులు రెండో సెట్‌ను ఈనెల 22న దాఖలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. నామినేషన్ దాఖలు అనంతరం విలేకరులతో ఎమ్మెల్సీ అభ్యర్థులు మాట్లాడారు.

పటిష్ట బందోబస్తు

నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగేందుకు పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఆర్ఓ కార్యాలయం నుంచి 100 మీటర్ల వరకు హద్దులు నిర్ణయించి పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు. డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, వన్‌టౌన్ సీఐ శివశంకర్‌రెడ్డి పర్యవేక్షణలో పోలీసు అధికారులు, పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో, అధికార పార్టీతో పాటు 36 ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నా. ఉపాధ్యాయ ఓటర్లు నాకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నా. ప్రభుత్వానికి, ఉపాధ్యాయులకు వారధిగా ఉంటూ విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా.

– రామచంద్రారెడ్డి
ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి

సంక్షేమ పథకాలే బలం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దీవెనలతో, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ ఆశీర్వాదంతో పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నా. అన్ని వర్గాల అభివృద్ధికి సీఎం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నాకు గొప్ప బలం. రాయలసీమపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారు. పరిశ్రమల స్థాపన ద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారు. నాకు ఓటు వేయాలని పట్టభద్ర ఓటర్లను వినమ్రంగా కోరుకుంటున్నా.

– వెన్నపూస రవీంద్రారెడ్డి
పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి

ఖాద్రీ బ్రహ్మోత్సవాలు విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

- సమన్వయ సమావేశంలో ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

కదిరి టౌన్: 'ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు మార్చి 2 నుంచి 16 వరకు జరుగుతాయి.. సమష్టి కృషితో ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించి విజయవంతం చేద్దాం' అని కదిరి ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి అన్నారు. ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాల నేపథ్యంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి హాజరై మాట్లాడారు. ప్రతి ఏడాది ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సారి కూడా శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఉత్సవాలకు సంబంధించి ప్రభుత్వ యంత్రాంగంతో సమన్వయం చేసుకొని అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులకు సౌకర్యంగా ఉండేలా కోనేరుకు తాత్కాలికంగా మరమ్మతు చేయించి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. బ్రహ్మోత్సవాలు ముగిసిన వెంటనే కోనేరు నిర్మాణాన్ని చేపడతామని చెప్పారు. మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసుకొని తిరువీధులు పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. టీటీడీ కల్యాణ మండపాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా ఇప్పటికే 33 సంవత్సరాలు లీజుకు తీసుకున్నామని, రాబోయే రోజుల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. 15 రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండ అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, బీజేపీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు దేవానంద్, జిల్లా అధ్యక్షుడు వజ్రభాస్కర్‌రెడ్డి, రైల్వే పీఈసీ మెంబర్ గంగాధర్, ఉత్తమరెడ్డి, ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు, పార్థసారథి ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే బలిజలకు రాజ్యాధికారం



మాట్లాడుతున్న ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్, చిత్రంలో ప్రభుత్వ చీఫ్ విప్ ఉదయభాను, ఎమ్మెల్సీ రామచంద్రయ్య , మహాలక్ష్మి శ్రీనివాస్ తదితరులు



పురంలో ర్యాలీగా తరలివస్తున్న బలిజ కులస్తులు

- శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణలో వక్తలు

హిందూపురం: ఐక్యతతోనే బలిజలకు రాజ్యాధికారం సాధ్యమని వక్తలు తెలిపారు. జిల్లా బలిజ సేవా సంఘం, ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్ నిశ్చల్ ఆధ్వర్యంలో హిందూపురం పట్టణంలో విజయనగర సామ్రాజ్యాధిపతి శ్రీకృష్ణదేవరాయలు విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. కృష్ణదేవరాయలు జయంతిని పురస్కరించుకుని హిందూపురం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయులు విగ్రహాన్ని జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ ఉదయభాను, ఎమ్మెల్సీ రామచంద్రయ్య, ఐఆర్ఎస్ చింతల పార్థసారధి, 'అవుడా' చైర్మన్ గురుమోహన్, టీటీడీ మాజీ చైర్మన్ ఆదికేశవులు కుమార్తె తేజశ్వరి, రాఘవయ్య తదితరులు హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. అంతకు ముందు అనంతపురం ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు నుంచి బలిజ కులస్తులు తరలివచ్చి పురవీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక చర్చి గ్రౌండ్‌లో నవీన్‌నిశ్చల్ అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ప్రభుత్వ చీఫ్ విప్ ఉదయభాను, ఎమ్మెల్సీ రామచంద్రయ్య మాట్లాడుతూ శ్రీకృషదేవరాయల ఆశాయాలకు అనుగుణంగా బలిజ కులస్తులు ఐక్యంగా ఉంటూ రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎదగాలని పిలుపునిచ్చారు. పిల్లలను ఉన్నతవిద్యావంతులను చేసి మంచి స్థానంలో నిలపడానికి కృషి చేయాలన్నారు. కాపు, బలిజ, తెలగ, ఒంటరి, అందరూ ఒకే కులస్తులని, ఒక్కో ప్రాంతంలో అలా పిలవబడుతున్నారని చెప్పారు. ఐక్యతతోనే రాజ్యాధికారం సాధించగలమన్నారు. కేవలం బలిజలు ఒక్కటే ఏకమైతే సరిపోదని అన్ని కులాల వారితో సఖ్యతతో మెలగాలన్నారు. అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ మాట్లాడుతూ బలిజ కులస్తుల ఆదరణతోనే తమకు రాజకీయంగా అవకాశాలు వస్తున్నాయన్నారు. ఏపీ ఆగ్రో చైర్మన్ నవీన్‌నిశ్చల్ మాట్లాడుతూ ఏపీలోని 5 కోట్ల జనాభాలో బలిజలు సుమారు 1.25 కోట్లు ఉన్నారని జనాభా ప్రతిపాదికన చట్టసభల్లో స్థానాలు కల్పించాలన్నారు. బలిజ సంఘం నాయకులు వేణుగోపాల్, బీజేపీ రాఘవయ్య, ఆరేటి ప్రకాష్, రామలింగయ్య, రవిప్రకాష్, అనంతరాజు, నరసింహయ్య, రాయల్‌గోపాల్, నాగరాజు, రమేష్,కౌన్సిలర్ రామచంద్ర, గోవిందప్ప,పార్థసారధి, మహేష్, మారుతి, ఉమేష్, రవికుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అడవికి నిప్పు


మంటలు ఆర్పుతున్న దృశ్యం

తనకల్లు: మండలంలోని సీఆర్ పల్లి, ఈతోడు గ్రామాల సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో గురువారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు రాజేశారు. దీంతో మంటలు పెద్ద ఎత్తున వ్యాపించాయి. సమాచారం అందుకున్న ఫారెస్ట్ గార్డులు శ్రీరాములు, సుధాకర బాబు.. స్థానికుల సహకారంతో మంటలు ఆర్పివేశారు.

పెట్రోల్ బంక్‌లో తనిఖీలు


రొళ్లలో కొలతలు పరిశీలిస్తున్న లీగల్ మెట్రాలజీ అధికారులు

రొళ్ల/అమరాపురం: తూకాల్లో మోసాలపై జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారులు దృష్టిసారించారు. ఈ క్రమంలో రొళ్ల, అమరాపురంలోని పలు పెట్రోల్ బంకుల్లో గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. పెట్రోల్, డీజిల్‌లో నాణ్యత, తూకం, స్టాక్ వివరాలతో పాటు తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో లీగల్ మెట్రాలజీ శాఖ ఇన్‌స్పెక్టర్ శివశంకర్, పౌరసరఫరాల శాఖ ఏఎస్‌ఓ ప్రభావతి, రొళ్ల తహసీల్దార్ హసీనాసుల్తానా, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సపోట తోటను చుట్టుముట్టిన మంటలు


మంటల్లో కాలిపోతున్న సపోట చెట్లు

తాడిమర్రి: గుర్తు తెలియని వ్యక్తులు కొండపై ఎండు గడ్డికి నిప్పు పెట్టడంతో సమీపంలోని సపోట తోటను మంటలు చుట్టుముట్టాయి. వివరాలు.. తాడిమర్రి మండలం మరవపల్లి గ్రామానికి చెందిన రైతు పిన్నదరి నరసింహుడు మూడేళ్ల క్రితం 500 సపోటా మొక్కలు నాటి తోటను అభివృద్ధి చేసుకున్నాడు. ప్రస్తుతం పంట కోత దశలో ఉంది. ఈ క్రమంలో గురువారం ఉదయం తోటకు సమీపంలోని గుట్టపై ఎండుగడ్డికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో మంటలు వ్యాపించి తోటలోని 60 చెట్లు కాలిపోయాయి. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేశారు. ఇదే ఘటనలో మరో రైతు రామకృష్ణారెడ్డికి చెందిన 50 కట్టల డ్రిప్పు వైర్లు మంటల్లో కాలి బూడిదయ్యాయి.

చిత్రావతిలో జలసవ్వడి

గత మూడేళ్లుగా చిత్రావతి నదీ పరివాహక ప్రాంతం జలకళతో కొత్త అందాలు సంతరించుకుంది. నదిపై అక్కడక్కడ నిర్మించిన చెక్‌డ్యాంలు నిండు కుండను తలపిస్తున్నాయి. దీంతో చుట్టుపక్కల గ్రామాల్లోని బోరుబావులు, వ్యవసాయ బావుల్లో నీటి మట్టం పెరిగి పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. పుట్టపర్తి అర్బన్:


పెదపల్లి వద్ద బోరుబావి కింద సాగులో ఉన్న వరిమడి


జీడుపల్లి వద్ద పచ్చదనాన్ని సంతరించుకున్న వేరుశనగ


చిత్రావతి నదిలో ప్రవహిస్తున్న నీరు


బుక్కపట్నం చెరువుకు ఎగువన సాగవుతున్న మొక్కజొన్న పంట

వృద్ధురాలిని ఏమార్చి నగల అపహరణకు యత్నం

● పోలీసుల అదుపులో 'అనంత' వాసి

పావగడ: వృద్ధురాలిని ఏమార్చి బంగారు నగలు అపహరించుకెళ్లే కేటుగాడి ప్రయత్నాన్ని స్థానికులు తెలివిగా తిప్పికొట్టారు. వివరాలు.. పావగడ తాలూకా బుడిబెట్ట గ్రామానికి చెందిన 80 ఏళ్ల వృద్ధురాలు గంగమ్మ బుధవారం మధ్యాహ్నం పావగడ బస్టాండుకు చేరుకుంది. ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని గమనించిన ఓ కేటుగాడు ఆమెతో మాటలు కలిపాడు. తనకు ప్రభుత్వాధికారులు తెలుసునని ప్రతి నెలా రూ.30 వేలు పింఛన్ వచ్చేలా చేస్తానన్నాడు. అతని మాటలపై నమ్మకం కలిగిన గంగమ్మ ఎలాగైనా పింఛన్ వచ్చేలా చేయమని వేడుకుంది. దీంతో కొన్ని రికార్డులు సిద్ధం చేసి, ఫొటో జతపరచాలని కేటుగాడు తెలిపాడు. ఇందుకు ఆమె సరేననడంతో మెడలో బంగారు నగలు ఉంచుకుని ఫొటో దిగితే పింఛన్ రాదని, ఆ నగలు తీసి తన చేతికి ఇస్తే భద్రంగా దాచి ఫొటో తీసిన తర్వాత అప్పగిస్తానన్నాడు. అప్పటికే అతని మాయలో చిక్కుకున్న వృద్ధురాలు తన మెడలోని రూ.60 వేలు విలువ చేసే బంగారు నగలు తీసిచ్చింది. అనంతరం ఆమెను సమీపంలోని బ్రైట్ ఫ్యూచర్ కంప్యూటర్ కేంద్రంలోకి పిలుచుకెళ్లి ఫొటో తీయాలని చెప్పాడు. యువకుడి వాలకంపై అనుమానం వచ్చిన కంప్యూటర్ కేంద్రం నిర్వాహకుడు వృద్ధురాలిని ఆరా తీయడంతో ఆమె అసలు విషయం తెలిపింది. అప్పటికే అక్కడి నుంచి ఉడాయిస్తున్న కేటుగాడిని కంప్యూటర్ కేంద్రం సిబ్బంది వెంబడించి పట్టుకుని, పోలీసులకు అప్పగించారు. విచారణలో కేటుగాడిని అనంతపురం నగరానికి చెందిన నరేంద్రగా గుర్తించారు. బంగారు నగలను వృద్ధురాలికి అప్పగించి, మరోసారి అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మరాదని హితవు పలికారు. కాగా, గంగమ్మ ఇద్దరు కుమారులుండగా.. ఓ కుమారుడు తుమకూరు పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐగా, మరో కుమారుడు వైద్య వృత్తిలో స్థిరపడ్డారు.


మోసపోయిన తీరును పోలీసులకు వివరిస్తున్న గంగమ్మ (చిత్రంలో) నిందితుడు నరేంద్ర

గ్రూపు-2కు ఎంపికైన కానిస్టేబుల్

హిందూపురం: హిందూపురం రూరల్ పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న స్నేహ.. గ్రూపు- 2 పరీక్షల్లో సత్తా చాటారు. గణాంకాల అధికారిగా ఎంపికయ్యారు. గురువారం ఫలితాలు విడుదలయ్యాయి. లేపాక్షి మండలం మానేంపల్లిలో రైతు గోపాల్, పద్మావతి దంపతుల కుమార్తె స్నేహ పట్టుదలతో ఏపీపీఎస్సీ పరీక్షలకు సన్నద్ధమైంది. ఈ క్రమంలో తన లక్ష్యాన్ని సాధించిన స్నేహను ఈ సందర్భంగా పోలీసు ఉద్యోగులతో పాటు గ్రామ పెద్దలు, బంధువులు అభినందించారు.

స్నేహ →



ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డిపై హత్యాయత్నం

అనంతపురం: పాఠశాల విద్య ఆర్జేడీ బి. ప్రతాప్‌రెడ్డిపై కొందరు హత్యాయత్నం చేశారు. గురువారం ఆయన ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంలతో పంగల్ రోడ్డులోని ఆర్డీటీ అంధుల పాఠశాలలో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం రాత్రి ఆర్డీటీ అతిథి గృహంలో బస చేశారు. ఈ క్రమంలో ఆర్జేడీని కలవడానికి మిత్రులు, బంధువులు ఆర్డీటీ అతిథి గృహం వద్దకు వచ్చారు. ఈ సమయంలోనే ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులమంటూ ఐదుగురు అక్కడికి వచ్చారు. వచ్చీరాగానే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులను ప్రలోభ పెట్టడానికి వచ్చావంటూ ఆర్జేడీ బి. ప్రతాప్‌రెడ్డిపై దాడికి యత్నించారు. అక్కడే ఉన్న ప్రతాప్ రెడ్డి బంధువులు, స్నేహితులు వారిని అడ్డుకున్నారు. వెంటనే పోలీసులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి ఆర్జేడీపై దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఒక ప్రభుత్వ ఉన్నతాధికారి విధులకు ఆటంకం కలిగిస్తూ... ఆయన్ని హత్య చేయాలని పురమాయించిన వారి వివరాలను సైతం పోలీసులు రాబట్టే పనిలో నిమగ్నమయ్యారు.

నా స్నేహితులే లేకపోతే ఏమయ్యేదో

తాను గురువారం ఉదయం ఆదోనిలో 300 మంది ప్రధానోపాధ్యాయులతో సమావేశాన్ని ఏర్పాటు చేశానని, సమావేశం ప్రారంభంలోనే 'ఆర్జేడీ గో బ్యాక్.. వైఎస్సార్‌సీపీ ఏజెంట్ అంటూ కొందరు సమావేశాన్ని అడ్డగించారని ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఎవరని ఆరా తీస్తే తాము ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్ నాయకులమని చెప్పారన్నారు. వెంటనే పోలీసులు జోక్యం చేసుకుని సమావేశాన్ని కొనసాగేలా చూశారన్నారు. అలాగే అనంతపురంలో సమావేశం తర్వాత తాను ఆర్డీటీ అతిథి గృహంలో బస చేశానన్నారు. తన చిన్ననాటి మిత్రులంతా తనను చూసేందుకు రాగా, ఐదుగురు ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్ నాయకులమని చెప్పి తాగి వచ్చారన్నారు. ఎక్కడ ఆర్జేడీ అంటూ ప్రతి గదిలోనూ వెతికారని, తనపై దాడికి దిగారన్నారు. ఆ సమయంలో నా స్నేహితులు లేకపోతే ఏమై ఉండేదో ఊహించలేనని ఆర్జేడీ తెలిపారు. తాను ఎన్నికల నిబంధన ఉల్లంఘించినట్లు ఎవరైనా భావిస్తే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసుకోవాలి గానీ, ఇలా భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. ప్రభుత్వం తనకు భద్రత పెంచాలని కోరారు.


ప్రతాప్ రెడ్డిపై దాడికి ప్రయత్నిస్తున్న దృశ్యం

ఆర్టీసీ స్థలాల లీజుపై అవగాహన

కదిరి అర్బన్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లోని ఖాళీ స్థలాలను లీజుకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యాపారులకు జిల్లా ప్రజారవాణాధికారి మధుసూదన్ సూచించారు. ఆర్టీసీ ఖాళీ స్థలాలను లీజుకు ఇచ్చే అంశంపై గురువారం కదిరి డీఎం కార్యాలయంలో వ్యాపారులకు అవగాహన కల్పించారు. పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం కింద అత్యాధునిక సౌకర్యాలతో కొత్త బస్టాండ్ నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో నూతన బస్టాండ్‌లో వ్యాపారాలు నిర్వహించుకునేందుకు ఖాళీ స్థలాలను 33 ఏళ్ల పాటు లీజుకు ఇవ్వనున్నట్లు తెలిపారు.

రుణాలు సక్రమంగా చెల్లించేలా చొరవ తీసుకోండి


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నరసయ్య

అమరాపురం: మండలంలోని మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలు సక్రమంగా వాయిదాల ప్రకారం చెల్లించేలా అధికారులు చొరవ చూపాలని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య అధికారులను ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో హేమ మండల మహిళా అధ్యక్షురాలు లలితమ్మ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ మండలంలో ఎన్ని మహిళా సంఘాలు ఉన్నాయి? ఎంతమంది సభ్యులు ఉన్నారు? రుణాలు ఏఏ సంఘాలకు ఎంత ఇచ్చారు? రికవరీ ఎలా ఉంది? తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి మహిళా సంఘానికి రుణాలు అందజేయాలన్నారు. ఇచ్చిన రుణాలను సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకునేలా చూడాల్సిన బాధ్యత అధికారులు మరియు వీఓఏలదేనన్నారు. వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా ఎదగాలని మహిళా సంఘాల సభ్యులకు సూచించారు. అలాగే మడకశిర నియోజకవర్గంలో అత్యధిక శాతం బోరు బావుల కింద రైతులు వక్కతోటలను సాగు చేస్తున్నారని, అయితే వక్కపంట తొలగించిన తరువాత వక్క వలుచు యంత్రాలు అవసరమన్నారు. ప్రభుత్వం నుంచి సబ్సిడీ ద్వారా వక్క యంత్రాలను సరఫరా చేసేలా చూస్తామని, అలాగే వక్క ఆరబెట్టడానికి టార్పాలిన్లు అందిస్తామన్నారు.

వెటరన్స్ క్రికెట్ టోర్నీ ప్రారంభం


తలపడుతున్న ఆర్డీటీ, హైదరాబాద్ వెటరన్ జట్లు

అనంతపురం సప్తగిరి సర్కిల్: అనంత క్రీడా గ్రామంలోని ప్రధాన క్రీడా మైదాన వేదికగా ఆర్డీటీ ఆధ్వర్యంలో మాంఛో రోలింగ్ ట్రోఫీ విన్సెంట్ ఫెర్రర్ వెటరన్స్ క్రికెట్ టోర్నీ గురువారం ప్రారంభమైంది. ఆర్డీటీతో పాటు హైదరాబాద్, గుంటూరు, కడప, నెల్లూరు, విజయవాడ జట్లు ప్రాతినిధ్యం వహించనున్నాయి. తొలి మ్యాచ్‌లో ఆర్డీటీ (అనంతపురం), హైదరాబాద్ వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ జట్టు నిర్ణీత 30 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 229 పరుగులు చేసింది. జట్టులో గిరి 29 బంతుల్లో 10 ఫోర్లతో 60 పరుగులు సాధించి అజేయంగా నిలిచాడు. చంద్రశేఖర్ 42 పరుగులు, దామోదర్ 39 పరుగులతో అలరించారు. ఆర్డీటీ బౌలర్లలో ప్రదీప్, వెంకటేష్ చెరో 2 వికెట్లు, సాయికృష్ణ 1 వికెట్ సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆర్డీటీ జట్టు 24 ఓవర్లలోనే కేవలం 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జట్టులో ప్రదీప్ 88 బంతుల్లో 17 ఫోర్లు, 1 సిక్సర్‌తో 134 పరుగులు సాధించాడు. హరినాథరెడ్డి 29 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సర్లతో 30, అక్బర్ 25 బంతుల్లో 4 ఫోర్లతో 29, శంకర్ 32 బంతుల్లో 2 ఫోర్లతో 28 పరుగులతో రాణించారు. 8 వికెట్ల తేడాతో ఆర్డీటీ జట్టు భారీ విజయాన్ని సాధించింది.

పోలీసు అదుపులో జంట హత్యల నిందితులు?

గుంతకల్లు: సంచలనం సృష్టించిన జంటహత్యల కేసులో నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. మొత్తం ముగ్గురు పోలీసులకు చిక్కినట్లు సమాచారం. గుంతకల్లులో ఈ నెల 14న జీపీ హేమకోటిరెడ్డితో పాటు అడ్డుకోబోయిన డ్రైవర్ షేక్షావలిని కత్తులతో పొడిచి హత్య చేసిన విషయం తెలిసిందే. కోటిరెడ్డి ఇంటి బయట షాపులకు అమర్చిన సీసీ ఫుటేజీల్లో నిందితుల కదలికలను గుర్తించిన పోలీసులు వాటి ఆధారంగా ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కోటిరెడ్డి పెద్దనాన్న కేశవరెడ్డి మనవడు ఈ హత్యలో పాల్గొన్నట్లు సమాచారం. నిందితులను నేడో రేపో మీడియా ముందు ప్రవేశపెట్టనున్నట్లు తెలిసింది.

నగదు రహిత లావాదేవీలు సురక్షితం

కదిరి అర్బన్: నగదు రహిత లావాదేవీలు సురక్షితమని, ప్రతి ఒక్కరూ డిజిటల్ లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం అనిల్‌కుమార్ సూచించారు. స్థానిక స్టేట్‌బ్యాంక్ మెయిన్ బ్రాంచ్‌లో ఆర్‌బీఐ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను గురువారం నిర్వహించారు. ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ ఫణికుమార్ అధ్యక్షత వహించారు. ఏజీఎం అనిల్‌కుమార్, ఎల్‌డీఎం సాయినాథరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై, మాట్లాడారు. డిజిటల్ బ్యాంకింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం డిజిటల్ బ్యాంకింగ్‌కు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్లు వీరమారుతి, నాగప్పలతో పాటు పలువురు ఖాతాదారులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసనా స్థాయిని మెరుగుపరచండి

మడకశిర రూరల్: ప్రణాళిక బద్ధంగా అభ్యసనాభివృద్ధి కార్యక్రమాన్ని అమలు చేస్తూ విద్యార్థుల్లో అభ్యసనా స్థాయిని మెరుగుపరచాలని ఉపాధ్యాయులకు లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎల్‌ఐపీ) రాష్ట్ర పరిశీలకులు నాగేంద్రరెడ్డి, విజయకుమార్ సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల విద్యాభ్యాస సామర్థ్యం పెంపే లక్ష్యంగా ఎల్‌ఐపీ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టినట్లు పేర్కొన్నారు. గురువారం మడకశిర మండలం బుళ్లసముద్రంలోని జెడ్పీఉన్నత పాఠశాలను వారు సందర్శించారు. ఎల్‌ఐపీ కార్యక్రమం అమలు తీరు, రికార్డులు, బోధన విధానాలను పరిశీలించారు. పలువురు విద్యార్థులకు పాఠ్యాంశాలపై ప్రశ్నలు వేసి అభ్యసనా ప్రగతిని ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంఈఓ భాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గాండ్లపెంట: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను ఎల్‌ఐపీ రాష్ట్ర పరిశీలకులు కె.జాఫర్ హుస్సేన్ గురువారం సందర్శించి అభ్యాసన స్థాయి మెరుగుకు చేపట్టిన చర్యలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థిని అభ్యసనా ప్రగతిని తెలుసుకుంటున్న ఎల్‌ఐపీ పరిశీలకుడు

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి ఏపీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, మోదా జెడ్పీ ఉన్నత పాఠశాల, పరిగి కేజీబీవీని ఎల్‌ఐపీ రాష్ట్ర పరిశీలకులు అభిజిత్, డాక్టర్ హరికుమార్ గురువారం సందర్శించి, విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. పాఠ్యాంశాలపై పలు ప్రశ్నలు విద్యార్థులు బదులిచ్చిన సమాధానాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మీదేవి, సీఆర్‌పీలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తలుపుల: మండలంలోని కుర్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలనుగురువారం రాయచోటి డైట్ లెక్చరర్ జాఫర్ సందర్శించి, ఎల్‌ఈపీ కార్యక్రమం అమలు తీరుపై ఉపాధ్యాయులతో ఆరా తీశారు. విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యం మెరుగుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామచంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు న్యాయమైన పరిహారం

● కలెక్టర్ బసంత్ కుమార్

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో నూతనంగా ఏర్పాటు కానున్న హైవేల నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న నిర్వాసితులకు న్యాయమైన పరిహారం పంపిణీ చేస్తామని కలెక్టర్ బసంత్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాతీయ రహదారుల భూసేకరణ, రీసర్వే, గృహ నిర్మాణాలు తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. అనంతరం జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ బసంత్ కుమార్ స్థానిక కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటు కానున్న హైవేల కోసం 650 హెక్టార్ల భూమిని సేకరించామన్నారు. ఈ నెలలోనే 300 హెక్టార్ల భూమికి సంబంధించి రైతులకు నాణ్యమైన పరిహారం అందిలా చర్యలు చేపడుతున్నామన్నారు. జాతీయ రహదారులతో పాటు ఏపీఐఐసీకి భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. స్పందన అర్జీలపై అన్ని శాఖల అధికారులు సకాలంలో స్పందించి న్యాయమైన పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్, డీఆర్‌ఓ కొండయ్య, డీఏఓ సుబ్బారావు, డీహెచ్‌ఓ చంద్రశేఖర్, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, డ్వామా పీడీ రామాంజనేయులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి రషీద్, పంచాయతీరాజ్ ఎస్ఈ గోపాల్‌రెడ్డి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

హేమావతి బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక బస్సులు

మడకశిర: అమరాపురం మండలం హేమావతిలో ఈ నెల 18 నుంచి జరిగే సిద్ధేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు మడకశిర ఆర్టీసీ డీఎం ప్రవీణ్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. మడకశిర, రొళ్ల, అగళి, గుడిబండ, అమరాపురం మండల కేంద్రాల నుంచి 25 ప్రత్యేక బస్సులు నడుస్తాయని పేర్కొన్నారు. అలాగే బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని హేమావతిలో భారీ బందోబస్తును ఏర్పాటు చేయనున్నట్లు సీఐ సురేష్‌బాబు తెలిపారు.

వ్యక్తి బలవన్మరణం


శంకరప్ప మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

రొద్దం: అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... రొద్దం మండలం పెద్దకోడిపల్లికి చెందిన శంకరప్ప (44)కు భార్య, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. వ్యవసాయ కూలి పనులతో జీవనం సాగిస్తున్నారు. కుటుంబ పోషణ, ఇతర అవసరాల కోసం ప్రైవేట్ వ్యక్తుల వద్ద శంకరప్ప అప్పు చేశాడు. అది కాస్త వడ్డీతో కలుపుకుని రూ.4 లక్షలకు చేరుకుంది. దీంతో అప్పులు తీర్చడం ఎలాగో తెలియక మదన పడుతుండేవాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం భార్య కూలి పనుల కోసం వెళ్లిన సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న శంకరప్ప ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం ఇంటికి చేరుకున్న భార్య తలుపు తీయగానే ఫ్యాన్‌కు వేసుకున్న ఉరికి వేలాడుతున్న భర్త మృతదేహాన్ని చూసి బోరున విలపించింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ చంద్రశేఖర్.. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు.